సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. మంగళవారం దారుసాలంలో నిర్వహించిన కార్యక్రమంలో 35 మంది లబ్ధిదారులకు ఆయన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలకు గురై ఆర్థిక ఇబ్బందులకు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారికి ప్రభుత్వం సీఎం సహాయ నిధి నుంచి రూ.15.60 లక్షల నిధులను మంజూరు చేసిందని తెలిపారు. దీంతో 35 మంది లబ్ధిదారులకు మంజూరు చేసిన చెక్కులను బాధిత కుంటుబాలకు పంపిణీ చేశామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఆకట్టుకున్న సంహిత నృత్య ప్రదర్శన



సంహిత వేమనను సత్కరిస్తున్న ముఖ్య అతిథులు

సుల్తాన్‌బజార్: శాస్త్రీయ నృత్యాలు భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు యూనివర్సిటీ అకాడమిక్ అఫైర్స్ డీన్ డాక్టర్ వనజ ఉదయ్ అన్నారు. అక్షద స్కూల్ ఆఫ్ ఫర్ఫామింగ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సంహిత వేమ కూచిపూడి రంగప్రవేశం కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా డాక్టర్ వనజ ఉదయ్ హాజరై సంహిత వేమను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంహిత చేసిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ విమర్శకులు జీవి.అన్నరావు, డాక్టర్ వెంకట్రావ్, తిలగవతి తదితరులు పాల్గొన్నారు.

సబితా రామకృష్ణ ముదిరాజ్‌కు సత్కారం



సబితా రామకృష్ణ ముదిరాజ్‌ను సత్కరిస్తున్న డాక్టర్ బండ ప్రకాశ్

గౌలిపురా: అంతర్జాతీయ యువజన దినోత్సవం ముగింపు ఉత్సవాల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు పల్లెబోయిన సబితా రామకృష్ణ ముదిరాజ్‌కు జాతీయ ఐక్యత అవార్డుతో ఘనంగా సత్కరించారు. సబితా 20 ఏళ్లుగా నిరుపేదలకు సేవా కార్యక్రమాల్లో పాల్గొని ప్రశంసలు, పురస్కారాలను అందుకున్నారు. నిరుపేద మహిళలు, స్కూల్, కాలేజీ విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తూ వారి విద్య, సంక్షేమ అభివృద్ధికి కృషి చేస్తూ సేవలందిస్తున్నందుకు సబితాకు జాతీయ ఐక్యత అవార్డును తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ అందజేసి శాలువా, అవార్డుతో ఘనంగా సత్కరించారు.

వర్షానికి కూలిన ఇల్లు



అబిడ్స్: మంగళ్‌హాట్‌లోని గుఫానగర్ మల్లన్న గుడి వద్ద ఓ ఇల్లు నేలమట్టమైంది. కొన్ని రోజులుగా వర్షానికి తడిసి మంగళవారం కుప్పకూలింది. ఆ సమయంలో ఇంటి ఓనర్ కనజరాజు, అతని కుటుంబసభ్యులు ఇంట్లో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న పోలీసులు, బీఆర్ఎస్ నాయకుడు జి.శ్రీనివాస్‌యాదవ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు జి.శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ..బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

‘ప్రభుత్వమే బాధ్యత వహించాలి’

గోల్కొండ: రాష్ట్రంలో విద్యుత్ శాఖలో పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని విద్యుదాఘాతంతో వరుసగా పలువురు వ్యక్తులు మృతి చెందుతున్న ఘటనలు జరుగుతుండడం దీనికి నిదర్శనం అని గుడిమల్కాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దేవర వంశీ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే ఇటువంటి దుర్ఘటనలు జరుగుతున్నాయన్నారు. విద్యుత్ స్తంభాలు, తీగల నిర్వహణ లోపభూయిష్టంగా ఉందన్న విషయాన్ని ఈ సంఘటనలు నిరూపిస్తున్నాయన్నారు. ప్రధాన రహదారులపైనే ఈ పరిస్థితి ఉంటే ఇక బస్తీలు, కాలనీలలో ఏ విధంగా ఉంటుందో అని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, మంత్రులు గానీ ఈ ఘటనలపై స్పందించకపోవడం విచారకరమన్నారు.

గల్లీ గల్లీలో వినాయక ఉత్సవాల సందడి

- చవితి ఉత్సవాలకు ముస్తాబవుతున్న పాతబస్తీ
- మండపాలకు విగ్రహాల తరలించడంలో బిజీగా నిర్వాహకులు
- పర్యావరణ పరిరక్షణకు మొగ్గు చూపుతున్న వైనం
- ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్న అధికారులు



పాతబస్తీలో రూపుదిద్దుకుంటున్న కోల్‌కతా మట్టి విగ్రహాలు

చార్మినార్: పాతబస్తీలో వినాయక చవితి ఉత్సవాల సందడి నెలకొన్నది. ఏ గల్లీలో చూసినా చిన్నారులతో పాటు యువకుల హడావుడి ఎక్కువగా కనిపిస్తోంది. ఉత్సవాల నిర్వాహకులు మండపాలను ఏర్పాటు చేయడంతో పాటు ఇప్పటికే ఆర్డరిచ్చిన వినాయక విగ్రహాలను ఆయా మండపాలకు తరలించడంలో బిజీగా మారారు. ఈ నేపథ్ సోమవారం అర్ధరాత్రి జరిగిన విద్యుత్ ప్రమాదంతో పురానాపూల్ పరిసరాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. పురానాపూల్‌కు చెందిన వినాయక ఉత్సవాల నిర్వాహకులు పాతబస్తీ శివారు ప్రాంతంలోని జల్‌పల్లి నుంచి భారీ వినాయక విగ్రహాన్ని తరలిస్తుండగా..జరిగిన ప్రమాదం సంఘటనపై పాతబస్తీ ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సంఘటన తప్పా.. ఉత్సవాల ఏర్పాట్లలో నిర్వాహకులు బిజీగా మారారు. మరోవైపు పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు సైతం ఉత్సవాల ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహించి ఉత్సవాల నిర్వాహకులకు తగిన సలహాలు, సూచనలు చేస్తున్నారు. దక్షిణ మండలం పోలీసులు ఆయా ఏసీపీల పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల వారీగా నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి బందోబస్తుతో పాటు శాంతి భద్రతల వివరాలను తెలియచేస్తున్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్న వినాయక నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని పాతబస్తీలో ఇప్పటి నుంచే పండుగ వాతావరణం కనిపిస్తోంది.

మట్టి విగ్రహాలకు ప్రాధాన్యం..

పాతబస్తీ లోని చాలప్రాంతాల్లో మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయడానికి ఉత్సవాల నిర్వాహకులు ముందుకొచ్చారు. ఈ మేరకు మట్టి విగ్రహాలను ప్రత్యేకంగా రూపొందిస్తున్నారు. కోల్‌కతా నుంచి వచ్చిన కొంత మంది కళాకారులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయడంలో పూర్తిగా నిమగ్నమయ్యారు. పర్యావరణ పరిరక్షణకు పాతబస్తీలోని కొంతమంది ఉత్సవాల నిర్వాహకులు మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించడానికి మొగ్గు చూపుతున్నారు.

ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశాం..



ఈ నెల 27న ప్రారంభమై వచ్చే నెల 6వ తేదీతో ముగిసే వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన మేరకు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడానికి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశాం. బాలాపూర్ నుంచి కొనసాగే నిమజ్జనోత్సవ ప్రధాన ఊరేగింపు రూట్‌లో బీటీ రోడ్డుతో పాటు అవసరమైన చోట రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు తదితర పనుల కోసం కార్యాచరణను రూపొందించాం. పారిశుద్ధ్య పనుల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నాం.

– సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, జోనల్ కమిషనర్

జాగ్రత్తలు తీసుకుంటూ.. ఆనందోత్సాహాలతో..



ఆనందోత్సాహాలతో వినాయక ఉత్సవాలను నిర్వహించుకోవాలి. ఉత్సవాల సందర్భంగా అవసరమైన ముందు జాగ్రత్తలు ఎంతో అవసరం. వినాయక విగ్రహాలను మండపాలకు తరలించేటప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలి. దుందుడుకుగా వ్యవహరించ రాదు. ఎక్కడైనా ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. నిమజ్జనోత్సవాల్లో పాల్గొనే భక్తులు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని సంతోషంగా పూజా కార్యక్రమాలను పూర్తి చేయాలి.

– నాగ్‌నాథ్ మాశెట్టి, కోకర్‌వాడి

మట్టి విగ్రహంతోనే పూజలు చేస్తున్నాం..

మీరాలంమండిలో మట్టి వినాయక విగ్రహంతోనే పూజలు చేస్తున్నాం. 2018 నుంచి ఆలయ ప్రాంగణంలోనే నిమజ్జనం చేస్తున్నాం. అంతకుముందు తాము కూడా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో అతి పెద్ద వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి వినాయకసాగర్‌లో నిమజ్జనం చేసే వారం. 2017 వరకు చేశాం. అనంతరం మట్టి విగ్రహానికి 5 నదుల జలాలు, పంచామృతం, 11 రకాల ఫ్లల రసాలు, 108 కలశాలు, 54 రకాల సుగంధ ద్రవ్యాలతో మట్టి విగ్రహానికి ఆలయం వద్దే నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నాం.

– గాజుల అంజయ్య, మీరాలంమండి



విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



విద్యుత్ సమస్యలను తెలుసుకుంటున్న చార్మినార్ డీఈ మల్లాది శ్రీధర్

చార్మినార్: పాతబస్తీలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని టీజీఎస్పీడీసీఎల్ చార్మినార్ డీఈ మల్లాది శ్రీధర్ అన్నారు. మంగళవారం సుల్తాన్‌షాహిలో విద్యుత్ అధికారులతో కలిసి ఆయన బస్తీబాట నిర్వహించారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాటు అధిక విద్యుత్ బిల్లులు, ఇతరత్రా విద్యుత్ సమస్యలను ఆయన స్థానిక వినియోగదారులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వినాయక ఉత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో ఆయన పరిశీలించారు. సంబంధిత మండపాల నిర్వాహకులతో సమావేశమై వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తుప్పు పట్టిన ఇనుప స్తంభాలతో పాటు ప్రమాదానికి అవకాశం ఉన్న వాటిని సైతం తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండపాల ఏర్పాటుతో పాటు నిమజ్జనోత్సవాల సందర్భంగా నిర్వహించే ఊరేగింపునకు ఎల్‌టీ, హెచ్‌టీ విద్యుత్ వైర్ల సమస్యలు తలెత్తకుండా యూజీ, ఏబీ కేబుల్ సిస్టంలను అందుబాటులోకి తేనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫలక్‌నుమా ఏడీఈ రాజు, సీబీడీ ఏడీఈ రాజేందర్ సింగ్, ఛత్రినాక ఏఈ దస్తగిరి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలి



నానల్‌నగర్ వద్ద విద్యుత్ స్తంభాలకు ఉన్న ప్రైవేటు కేబుల్స్‌ను తొలగిస్తున్న దృశ్యం

గోల్కొండ: ప్రైవేటు వ్యక్తులు, కేబుల్స్ నిర్వాహకులు విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్స్ వేయడానికి వీలు లేదని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. నగరంలో విద్యుత్ తీగల వల్ల ప్రమాదాలు జరుగుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన విద్యుత్ శాఖ అధికారులతో మంగళవారం కార్వాన్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రైవేటు కేబుల్స్ నిర్వాహకులకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. వివిధ రకాల కేబుల్స్‌ను, వైర్లను ప్రైవేటు కేబుల్ ఆపరేటర్లు విద్యుత్ స్తంభాలపై కుప్పలుతెప్పలుగా వేస్తున్నారన్నారు. ఈ కేబుల్స్ బరువుకు విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారుతున్నాయన్నారు. రెండు రోజులలోపు విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్స్ తొలగించకపోతే తానే రంగంలోకి దిగి అవసరమైన చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. నానల్‌నగర్ డివిజన్ డిప్యూటీ ఈఈ యూసుఫ్ బాబా, నానల్ నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శాలిబండ: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఫాతిమానగర్, ఫారూఖ్‌నగర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. అలాగే ఫాతిమానగర్, ఫారూఖ్ నగర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు. జంగమ్మెట్ ఓహెచ్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

విగ్రహాలను తరలించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి



ఇన్‌స్పెక్టర్ నాగరాజు

సంతోష్‌నగర్: వినాయక విగ్రహాలను తరలించే సమయంలో మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని ఐ.ఎస్.సదన్ ఇన్‌స్పెక్టర్ జి.నాగరాజు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ..వినాయక ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసుల అనుమతులు తప్పకుండా తీసుకోవాలన్నారు. వినాయకులను మండపాలకు తరలించే క్రమంలో నిర్వాహకులు ఎలాంటి విద్యుత్, అగ్ని ప్రమాదాలు, ఇతర ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వినాయక నిమజ్జన ఊరేగింపునకు ఫిట్‌నెస్ కలిగిన వాహనాలను మాత్రమే వినియోగించాలన్నారు.

పేదల బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తాం



అక్బర్‌బాగ్ బస్తీలో పర్యటిస్తున్న మహ్మద్ నజీబ్ తదితరులు

గోల్కొండ: పేదల కోసం వారి ఇంటి సమీపంలోనే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని పీస్ ఫోర్స్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ నజీబ్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకిలో సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ..నిరుపేదలు ఎక్కువగా నివసించే బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య విషయాలు కూడా సేకరిస్తామన్నారు. అసరమైతే వారికి ప్రభుత్వ ఆసుపత్రులకు పంపి చికిత్స అందించేందుకు కృషి చేస్తామన్నారు. పీస్ ఫోర్స్ సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలలో భాగంగా వచ్చే నెల నుంచి నెలకు రెండుసార్లు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్, ఫహద్, మహబూబ్ తదితరులున్నారు.

‘మౌన సాక్ష్యాలు’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పద్మనాబయ్య, కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఒక ఫొటో ఎన్నో భావాలను పలికిస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సృజన భారతి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ సత్యవటిలు సుందర సాయి రచించిన ‘మౌన సాక్ష్యాలు’పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఓ దినపత్రికలో ఫొటోగ్రాఫర్‌గా విధులు నిర్వహించిన కేశవులు తీసిన ఫొటోలను పుస్తక రూపంలోకి తీసుకురావడంతో ఎంతో మంది ఫొటోగ్రఫర్లకు ఒక దారి చూపినట్లు అయ్యిందన్నారు. పద్మ భూషణ్ కె.పద్మనాబయ్య మాట్లాడుతూ..కొన్ని సందర్భాల్లో పదాలు అబద్ధమవుతాయి కానీ ఫొటోలు మాత్రం అబద్ధాలు కాలేవన్నారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు టి.శంకర్‌నారాయణ, రసమయి అధ్యక్షులు ఎం.కే. రాము, సృజన భారతి అధ్యక్షులు కొమ్మూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీసీసీఐ తెలంగాణ టూరిజం ఫొటోగ్రఫీ కాంటెస్ట్-2025 ఫలితాలు వెల్లడి

నాంపల్లి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఎఫ్‌టీసీసీఐ తెలంగాణ టూరిజం ఫొటోగ్రఫీ కాంటెస్ట్-2025 విజేతలను ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రకటించింది. మంగళవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో జరిగిన సమావేశంలో ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు ఆర్.రవికుమార్, డైరెక్టర్ సంగీత, చైర్మన్ ప్రకాష్ అమ్మనబోలు, టూరిజం కమిటీ కో చైర్మన్ డి.రామచంద్రం సమక్షంలో ఈ ఫొటోగ్రఫీ కాంటెస్ట్ ఫలితాలను ప్రకటించారు. ప్రముఖ ఫొటో జర్నలిస్ట్ హెచ్.సతీష్, ల్యాండ్‌స్కేప్ ఫొటోగ్రాఫర్ సత్య ప్రసాద్‌తో కూడిన ఇద్దరు సభ్యుల నిపుణుల జ్యూరీ 100 మందికి పైగా ఫొటోగ్రాఫర్లు సమర్పించిన 500 చిత్రాలను మూల్యాంకనం చేశారు. వీటిలో ఎంపికైన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటుగా మరో ఎనిమిది మందికి ప్రోత్సాహక బహుమతులను ప్రకటించింది. మొదటి బహుమతి ముచ్చర్ల శ్రీనివాస్, రెండవ బహుమతి పుట్ల అశోకుడు, మూడవ బహుమతి షాలినీ జైన్‌కు లభించింది. విజేతలకు సెప్టెంబరు 1న హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగే ప్రత్యేక సన్మాన కార్యక్రమంలో బహుమతులు అందజేస్తారు.

నిలోఫర్‌లో బోనాల వేడుకలు



ఆసుపత్రి సిబ్బందితో కలిసి అమ్మవారిని దర్శించుకున్న సూపరింటెండెంట్ విజయ్‌కుమార్

నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రిలోని బంగారు లక్ష్మమ్మ ఆలయంలో బోనాల వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు బోనాలను సమర్పించారు. పోతరాజు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వ వైద్యాధికారుల సంఘం సెక్రెటరీ జనరల్ లాలూ ప్రసాద్ రాథోడ్, నిలోఫర్ ప్రొఫెసర్ డాక్టర్ వినోద్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ నాగజ్యోతి, బంగారు లక్ష్మమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఆంజనేయులు, రవీందర్, శ్రీనివాస్, గోపాల్, నిర్మల అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు నర్సింహాచారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తాం



జోనల్ కమిషనర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే

చార్మినార్: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బహదూర్‌పురా ఎమ్మెల్యే మహమ్మద్ ముబీన్ మంగళవారం నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించి పనులు వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన జోనల్ కమిషనర్‌కు సూచించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. చార్మినార్ జోన్ పరిధిలోని అన్ని సర్కిళ్ల వారీగా సంబంధిత డిప్యూటీ కమిషనర్లతో పాటు ఇంజినీరింగ్ విభాగం అధికారులతో ఇప్పటికే రివ్యూ నిర్వహిస్తున్నానన్నారు. బహదూర్‌పురా నియోజకవర్గంలో కూడా అన్ని అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయించడానికి కృషి చేస్తానన్నారు.

వాణిజ్య శాస్త్ర తెలుగు పదకోశం తయారీ 2.0 ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్

చార్మినార్: జాతీయ విద్యా విధానంలో భాగంగా వివిధ విభాగాల్లో అన్ని భారతీయ భాషలల్లో పారిభాషిక పదకోశాల తయారీకి కేంద్ర ప్రభుత్వం ఒక విధానాన్ని చేపట్టిందని ప్రభుత్వ సిటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్ తెలిపారు. ఇందులో భాగంగా వాణిజ్య శాస్త్ర పదకోశం (ఇంగ్లిష్-హిందీ-తెలుగు) తయారీ 2.0 కార్యశాల తమ కాలేజీలో ప్రారంభమైందన్నారు. వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యశాలను ప్రిన్సిపాల్ బాల భాస్కర్ మంగళవారం ప్రారంభించారు. ఐదు రోజులు జరిగే ఈ కార్యశాలలో వాణిజ్య శాస్త్ర, తెలుగు భాషా నిపుణులు గత ఏప్రిల్‌లో అనువాదం చేసిన పారిభాషిక పదాలను పునఃపరిశీలన చేయడంతో పాటు కొత్త పదాలను కొన్నింటినీ పదకోశానికి అందిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యశాల ఈనెల 19 నుంచి 23 వరకు నిర్వహించబడుతుందని కార్యశాల కన్వీనర్ డా.కె. మల్లికార్జున రావు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ యువజన ముగింపు ఉత్సవాలు



అవార్డులను ప్రదానం చేస్తున్న సంస్థ నిర్వాహకులు

సుల్తాన్‌బజార్: యువతరం ఆత్మ విశ్వాసంతో దేశ సమైక్యతకు, అభివృద్ధికి ముందడుగు వేయాలని తెలంగాణ శాసన మండలి సభ్యులు డాక్టర్ బండ ప్రకాష్ అన్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో అంతర్జాతీయ యువజన ముగింపు ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు యువత ధ్యేయం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జాతీయ ఐక్యత అవార్డులను, గ్లోబల్ ఐకాన్ యూత్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ పర్యావరణ అభివృద్ధి మండలి చైర్మన్ డాక్టర్ కొమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు డాక్టర్ కుమారస్వామి, కౌన్సిల్ కార్యదర్శి ఉదయ్ శ్రీ, డాక్టర్ రవితేజ, వేణుగోపాల్, సూర్య, షరీఫ్, అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్య జీవితానికి తొలిమెట్టు



మాట్లాడుతున్న కళాశాల కరస్పాండెంట్ కృష్ణారావు

అబిడ్స్: ఇంజినీరింగ్ విద్య విద్యార్థి జీవితానికి తొలి మెట్టు అని ఏడీపీ సీనియర్ డైరెక్టర్ శిరీష సోమయాజులు అన్నారు. స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కె.కృష్ణారావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.అనురాధ అధ్యక్షత వహించగా ఏడీపీ సీనియర్ డైరెక్టర్ శిరీష సోమయాజులు పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..ఇంజినీరింగ్ అంటే సమస్యలను పరిష్కరించే ఒక కళ అన్నారు. కోడింగ్, ప్రాక్టికల్స్, ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్ ద్వారా జ్ఞానాన్ని విస్తరించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల కరస్పాండెంట్ కృష్ణారావు మాట్లాడుతూ..కళాశాలలో చేరే విద్యార్థులకు ఉన్నతమైన విద్యాబోధన అందించడంతో పాటు వారికి కావాల్సిన విద్య వసతులను తామే కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజ్‌మెంట్ సభ్యులు టి.రాకేష్‌రెడ్డి, ఆర్.ప్రదీప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎల్ రాజు, అకాడమిక్స్ డీన్ ప్రొఫెసర్ ఎ.వినయ్‌బాబు, ఇన్నోవేషన్ అండ్ ప్లానింగ్ డీన్ డాక్టర్ సత్యప్రసాద్ లంక, ఆర్అండ్ డి.డైరెక్టర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బివి.రమణ మూర్తి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎ.రమేష్ అధ్యాపక, అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

24న కార్వాన్‌లో భజన పోటీలు

గోల్కొండ: భజన భారతి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 24న భజన పోటీలు నిర్వహిస్తున్నామని తెలంగాణ భజన భారతి కార్యదర్శి జొన్నకుంటి మధుసూదన్ అన్నారు. 24న ఉదయం 10 గంటల నుంచి గుడిమల్కాపూర్‌లోని అన్నపూర్ణ ఆలయంలో ఈ పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు. పురుషులు, స్త్రీలు, బాలురు, బాలికల విభాగాలలో ఈ పోటీలు ఉంటాయన్నారు. ప్రతి బృందంలో గరిష్ఠంగా ఆరుగురు సభ్యులు ఉండవచ్చునని, జట్టుకు 10 నిమిషాల సమయం కేటాయించబడుతుందన్నారు. నాలుగు విభాగాల్లో మొదటి రెండు స్థానాల్లో గెలిచిన జట్లు ఫైనల్స్‌కు చేరుతాయని ఆయన పేర్కొన్నారు. ఇతర వివరాలకు 94939 67399, 94404 99231లలో సంప్రదించవచ్చు.

కిడ్నాప్ కేసులో ఆరుగురు నిందితుల రిమాండ్

చాంద్రాయణగుట్ట: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిని కిడ్నాప్ చేసిన ఆరుగురిని బండ్లగూడ పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. సౌత్ ఈస్ట్ డీసీపీ ఎస్.చైతన్య కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 18న పని మీద బయటికి వెళ్లిన బండ్లగూడ నూరీనగర్‌కు చెందిన షేక్ షా వలీ అర్ధరాత్రి ఇంటికి వెళ్తుండగా రాజేంద్రనగర్ చింతల్‌మెట్‌కు చెందిన గంజాయి బ్యాచ్ అమేర్, ఉమర్, అమేర్ అలీ, రహెమాన్, ఇమ్రాన్, నయాబ్ ఆటోలో వచ్చి అడ్డుకున్నారు. కత్తి చూపించి డబ్బులు డిమాండ్ చేశారు. దానికి బాధితుడు ససేమిరా అనడంతో ఆటోలో ఎక్కించుకొని శ్రీరాం కాలనీకి తీసుకెళ్లి ఓ ఇంట్లో నిర్బంధించారు. అతని సోదరుడు షేక్ ఇర్ఫాన్‌కు ఫోన్ చేసి రూ.2 వేలు ఫోన్ పే చేయాలని, లేకుంటే షా వలీని చంపేస్తామని బెదిరించారు. ఈ విషయమై ఇర్ఫాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీపీ సుధాకర్, ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్ పర్యవేక్షణలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి సిగ్నల్ ఆధారంగా ఆరు గంటల్లో కిడ్నాప్‌ను ఛేదించారు. బాధితుడిని రక్షించి, నిందితులను అరెస్ట్ చేశారు.

గాంధీ జయంతి వేడుకలకు విస్తృత ప్రచారం చేస్తాం



వేం నరేందర్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

అబిడ్స్: అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా అన్ని ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేస్తామని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ యాలాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రతిరోజూ అన్ని ప్రాంతాల్లో పర్యటించి గాంధీ జయంతి ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తామన్నారు. ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం ఉంటుందని వేం నరేందర్‌రెడ్డి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో గాంధారి ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు నక్క మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.